క్లుప్తంగా

యోగాతో యువకుల్లో చైతన్యం



యోగాసనాలు చేయిస్తున్న టీచర్ పద్మావతి

కడప ఎడ్యుకేషన్: యోగాతో యువతలో చైతన్యం వస్తుందని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వరి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కడప పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా టీచర్ పద్మావతి విద్యార్థులతో సూర్య నమస్కారాలు వేయించారు. ప్రిన్సిపల్ జ్ఞానేశ్వరి మాట్లాడుతూ యోగతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు హబీబుల్లా, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ రాజారావు, అధ్యాపకులు సుధాకర్‌రెడ్డి, శ్రీరాములరెడ్డి, సుజాత, పద్మావతి, రోజమ్మ, చంద్రమౌళి, రామ సుబ్బయ్య, విద్యావతి, తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ పండగ రోజున యోగా డే వద్దు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దేశ వ్యాప్తంగా ఈ నెల 7న బక్రీద్ జరుపుకొంటున్నందున రాష్ట్ర ప్రభుత్వం యోగా డే, అవగాహనా ర్యాలీ నిర్వహించడం తగదని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ లీఖాన్ బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే యోగాడే ర్యాలీల నిర్వహణ తేదీని మార్చుచేయాలని కోరారు. అధికారికంగా ప్రభుత్వం బక్రీద్ సెలవుదినం ప్రకటించడంతో ఈ ర్యాలీల నిర్వహణ అధికారులకు సాధ్యం కాదన్నారు. అనాలోచితంగా, దూరదృష్టి లేకుండా అవగాహనా ర్యాలీ నిర్వహించడం సమంజసం కాదని పేర్కొన్నారు.

నిరుపేద పిల్లల కోసం సతి ప్రచారపత్రం



మాట్లాడుతున్న జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్

కడప అర్బన్: నిరుపేద పిల్లల కోసం సతి ప్రచార పత్రం అమలు చేస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. తమ సిబ్బందితో కలిసి బుధవారం స్థానిక చిన్నచౌక్ వద్ద దండోరా కాలనీలో నిరుపేద పిల్లలకు సతి ప్రచార పత్రం అమలు, ఆధార్ సర్వే, ట్రాకింగ్ తదితర అంశాలపై బుధవారం సర్వే నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ సర్వేలో జిల్లా వ్యాప్తంగా పానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, సంబంధిత అధికారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయ్యవారప్ప, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.


నేడు పర్యావరణంపై అవగాహనా ర్యాలీ

కడప సెవెన్‌రోడ్స్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగరంలో గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.00 గంటలకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ సంధ్య సర్కిల్ మీదుగా కోటిరెడ్డిసర్కిల్‌కు చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేడు పిచ్చమ్మ నిరాహారదీక్ష

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని శివానంద పురంలో పిచ్చమ్మ ఇంట్లోకి చొరబడి, జెసిబీతో కూల్చి వేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ నగర కార్యదర్శి యన్.వెంకట శివ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రిమ్స్ పోలీస్‌స్టేషన్ సీఐ, ఎస్ఐలపై చర్యలు చేపట్టాలని కోరుతూ పిచ్చమ్మ కడప కలెక్టరేట్ వద్ద గురువారం రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాల నేతలు సంఘీభావం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన మూల విరాట్ దేవతామూర్తులు

కడప కల్చరల్: సీతారామచంద్రుల నూతన విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. జగద్గురు పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీ స్వామి ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించి నూతన ఆలయంలో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. భక్తుల ఆధ్వర్యంలో సీతాసమేత, లక్ష్మణ రామచంద్రుల నూతన విగ్రహాలను ప్రతిష్ఠించి పూజోత్సవాలు నిర్వహించారు. పుష్పగిరి క్షేత్రంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నూతన దేవతా మూర్తుల విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. తొలుత జలాధివాసం తదితర కార్యక్రమాలనంతరం నేత్రోన్మీలనం నిర్వహించి భక్తుల జై శ్రీరామ్ నినాదాల మధ్య ఉత్సాహ భరితంగా పూజలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

కూటమి ప్రభుత్వంపై జనాగ్రహం

- కడపలో వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ
- జై జగన్...చంద్రబాబు డౌన్ డౌన్ నినాదాలతో మార్మోగిన నగరం



కడప నగరంలో భారీ ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన మహిళలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు కడప నగరంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ‘వెన్నుపోటు దినం’ కార్యక్రమానికి జనం వెల్లువెత్తారు. అన్ని డివిజన్ల నుంచి అధిక సంఖ్యలో ర్యాలీకి తరలివచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ర్యాలీ ప్రారంభించారు. కోటిరెడ్డి సర్కిల్, ఎన్‌టీఆర్ కూడలి, ఏడురోడ్ల కూడలి మీదుగా ఆర్‌డీఓ కార్యాలయానికి చేరింది. ర్యాలీ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు, వైఎస్సార్‌సీపీ జెండాలను ప్రదర్శిస్తూ జై జగన్...చంద్రబాబు డౌన్‌డౌన్, ఎన్నికల హామీలు అమలు చేయాలనే నినాదాలతో హోరెత్తించారు. ఆస్తి పన్నులు పెంచనన్నావ్...ఇప్పుడు పెంచావ్, వక్ఫ్ బిల్లుకు మద్దతిచ్చి ముస్లిం మైనార్టీలకు వెన్నుపోటు, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ల పేరుతో వెన్నుపోటు,తల్లికి వందనం పేరుతో తల్లులకు వెన్నుపోటు, రెడ్ బుక్ పేరుతో రాజ్యాంగానికి వెన్నుపోటు, నీకు రూ.15 వేలు..నీకు రూ.15 వేలు అని ఇచ్చిన హామీ ప్లకార్డులు ప్రదర్శిస్తూ, టీ షర్టులు ధరించి నిరసన తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆందోళన కార్యక్రమాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆర్‌డీఓ కార్యాలయ ఏఓ శంకరయ్యకు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేణుగోపాల్ నాయక్, సీహెచ్ వినోద్, కె. బాబు, దేవిరెడ్డి ఆదిత్య, సుబ్బరాయుడు, బసవరాజు, బాలస్వామిరెడ్డి, బీహెచ్ ఇలియాస్, పస్తం అంజి తదితరులు పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో: కడప నగరం మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న 24వ డివిజన్ బాలాజీ పేట నుంచి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి.జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించి పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు విసుగు చెందారని, హామీల అమలు కోసం స్వచ్ఛందంగా రోడ్డుమీదకు వస్తున్నారన్నారు.

20వ డివిజన్‌లో: స్థానిక 20వ డివిజన్‌లో ఏపీహెచ్‌బీ కాలనీ, ప్రకాష్ నగర్‌ల నుంచి ఆ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో యువకులు ర్యాలీ నిర్వహించారు. ఎర్రముక్కపల్లె, సంధ్యా సర్కిల్, జిల్లా పరిషత్ మీదుగా వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకున్నారు.

23వ డివిజన్‌లో: స్థానిక 23వ డివిజన్ నాగరాజుపేట నుంచి ఆ డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు, యువకులు టీ షర్టులు ధరించి ర్యాలీ చేపట్టారు. నాగరాజుపేట నుంచి వారు మురళీ థియేటర్ సర్కిల్ మీదుగా వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, బి. మరియలు, జ్యోతి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం నుంచి కూటమి ప్రభుత్వ విధానాలపై వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు కమలాపురంలో నిర్వహించిన ‘వెన్నుపోటు దినం’ నిరసన కార్యక్రమానికి చెన్నూరు మండలం నుంచి పార్టీ నేతలు బుధవారం భారీగా తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్ రెడ్డి, సురేష్ యాదవ్, నిరంజన్ రెడ్డి, మెడికల్ రవి ఉమామహేశ్వర్ రెడ్డి, మిట్ట కేశవ రెడ్డి, గుమ్మల్ల సాయికుమార్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, సంతోష్, రమణయ్య, సుబ్బారెడ్డి,క రుణాకర్, శేఖర్, మధు, సిద్దేష్ తదితరులు తరలివెళ్లారు.



బాలాజీ పేట నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న జయచంద్రారెడ్డి, తదితరులు



ప్రకాష్‌నగర్ నుంచి ర్యాలీగా వస్తున్న 20వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి తదితరులు



వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళి

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ బాబు

- ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీ నెరవేర్చలేదు
- ప్రభుత్వ అరాచకాలను ప్రతి కార్యకర్త రాసుకుంటున్నారు
- వెన్నుపోటు దినం కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ధ్వజం

కడప కార్పొరేషన్: 2024 ఎన్నికల్లో అలవిగాని హామీలిచ్చిన చంద్రబాబు... అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఒక్క హామీ నెరవేర్చకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పిలుపులో భాగంగా బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయం నుంచి కోటిరెడ్డి సర్కిల్, ఎన్‌టీఆర్ కూడలి, ఏడు రోడ్ల కూడలి మీదుగా ఆర్‌డీఓ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డీఓ కార్యాలయ ఏఓ శంకరయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ సంయుక్తంగా సూపర్ సిక్స్ హామీలతోపాటు 143 హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. పిల్లనిచ్చిన మామనే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు, ప్రజలను వెన్నుపోటు పొడవటం పెద్ద లెక్కకాదన్నారు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. 20లక్షల ఉద్యోగాలు, ఎంతమంది పిల్లలుంటే అంతమందికి అమ్మ ఒడి, నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, రైతులకు రూ.20వేలు పెట్టుబడి, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలు, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నెత్తిన భారం వేశారన్నారు. ముస్లిం మైనార్టీలకు అన్యాయం చేసే వక్ఫ్ బిల్లుకు మద్దతిచ్చి మోసం చేశారన్నారు. చెప్పిన హామీలు అమలు చేయకపోగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా అరాచక పాలన సాగిస్తున్నారన్నారు. 4500 మందిపై అక్రమ కేసులు బనాయించారని, ప్రభుత్వ వేధింపుల వల్ల 670 మంది ఆత్మహత్యాయత్నం చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చాక 390 మందిని హత్య చేశారన్నారు. చిన్నపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధిని పట్టించుకోకుండా అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ అరాచకాలను వైఎస్సార్‌సీపీ ప్రతి కార్యకర్త బుక్‌లో రాసుకుంటున్నారని హెచ్చరించారు. అనంతరం మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రా రెడ్డి, మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం హామీలు ఎప్పుడు అమలవుతాయా అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, యానాదయ్య, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్, నాయకులు పి. జయచంద్రారెడ్డి, దాసరి శివప్రసాద్, శ్రీరంజన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, షఫీ, తోటక్రిష్ణ, జమాల్‌వలీ, త్యాగరాజు, ఆర్‌వీ రమణ, ఐస్‌క్రీం రవి, డా. సొహైల్, అరీఫుల్లా బాషా, షంషీర్, రఫీ, టీపీ వెంకట సుబ్బమ్మ, పత్తి రాజేశ్వరి, రత్నకుమారి, మరియలు పాల్గొన్నారు.



మహిళల నిరసన



ఉచిత గ్యాస్ కోసం



అమ్మ ఒడి ఎప్పుడిస్తారంటూ...

బీఈడీ పరీక్షలు వాయిదా వేయాలి

కడప ఎడ్యుకేషన్: యోగివేమన యూనివర్సిటీలో జరిగే బీఈడీ పరీక్షలను వాయిదా వేయాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు కోరారు. యోగి వేమన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కేఎస్‌వీ.కృష్ణారావును కలిసి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం డీఎస్సీ–2025 పరీక్షలు జూన్ 6వతేదీ నుంచి 30వతేదీ వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. అదే సమయంలో యోగి వేమన యూనివర్సిటీలో జూన్ 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ బీఈడీ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. డీఎడ్ చేసిన అభ్యర్థులు యోగివేమన యూనివర్సిటీలో బీఈడీ చదువుతున్నారని, వారు డీఎస్సీ పరీక్షలకు హాజరుకావాల్సి ఉందన్నారు. ప్రొఫెసర్ కేఎస్‌వీ.కృష్ణారావు స్పందిస్తూ డీఎస్సీకి హాజరయ్యే అభ్యర్థులు నష్టపోకుండా తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అసిస్టెంట్ (ప్రొఫెసర్ జర్నలిజం) తుమ్మల సురేష్‌బాబు, ఎస్‌టీఎఫ్ గౌరవాధ్యక్షుడు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, చెన్నకేశవులు పాల్గొన్నారు.



వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారికి వినతిపత్రాన్ని ఇస్తున్న ఎస్‌టీఎఫ్ నాయకులు

ఐటీఐలలో 6వ తేదీ నుంచి కౌన్సిలింగ్

కడప ఎడ్యుకేషన్: వైఎస్ఆర్ కడప జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో చేరేవారికి 6వతేదీ నుంచి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల జిల్లా కన్వీనర్, మైనారిటీ ఐటీఐ ప్రధానాచార్యులు జ్ఞాన కుమార్ తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు జీపీఏ 10 నుంచి 5.7జీపీఏ సాధించిన వారికి, మధ్యాహ్నం 2 గంటల నుంచి జీపీఏ 5.5 నుంచి 2.2 జీపీఏ సాధించిన వారికి అడ్మిషన్ కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. విద్యార్థులందరూ తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్, పాస్ పోర్టు సైజు ఫొటో, కులధ్రువీకరణ పత్రం, టీసీ, ఆదాయ ధ్రువీకరణ పత్రం తీసుకుని కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని చెప్పారు. 10న మిగిలిన సీట్లకు కామన్ మెరిట్ పద్ధతిన సీటు పొందని వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తారన్నారు. ఒక మారు సీటు కేటాయించిన తర్వాత మార్పు చేసేందుకు ఆన్‌లైన్ నందు అవకాశం ఉండదని తెలిపారు. విద్యార్థులు కడప రిమ్స్ ఆసుపత్రి వద్ద ఉన్న పుష్పగిరి కంటి ఆసుపత్రి ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ మైనార్టీస్ వద్ద హాజరు కావాలని జ్ఞాన కుమార్ తెలిపారు. సమాచారం కోసం 9642602764, 8074577318 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.



ప్రభుత్వ మైనార్టీస్ ఐటీఐ

శ్వాసకోశ వ్యాధులకు ఆధునిక వైద్యం

కడప రూరల్: యశోద ఆసుపత్రిలో శ్వాసకోశ వ్యాధులకు ఆధునిక చికిత్స ఉందని ఎక్మో అండ్ లంగ్ ట్రాన్స్ ప్లాంటేషన్ స్పెషలిస్ట్ డాక్టర్ విశ్వేశ్వరన్ బాలసుబ్రహ్మణ్యన్ తెలిపారు. స్థానిక యశోద ఆసుపత్రి మెడికల్ సెంటర్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ యశోద ఆసుపత్రిలో శ్వాసకోశ వ్యాధులకు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, నగరానికి చెందిన 60 ఏళ్ల బాషా శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడేవారని తెలిపారు. ఆయన ఏ ఆసుపత్రిలో చూపించుకున్నా వ్యాధి నయం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆయన హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆసుపత్రికి వచ్చారని తెలిపారు. ఆయనకు సిటీ స్కాన్‌తో పాటు పల్మనరీ ఫంక్షన్, బ్రాంకో స్కోపీ పరీక్ష నిర్వహించి ఇంటెన్సెల్ లంగ్ డిసీజ్ తీవ్రత ఏ స్థాయిలో ఉందో నిర్ధారించామని తెలిపారు. వ్యాధి నిర్ధారణ తర్వాత చికిత్స అందించడంతో పేషెంట్ క్రమేనా కోలుకున్నారన్నారు. తమ ఆసుపత్రిలో శ్వాసకోశ వ్యాధులకు సంబంధించి లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఎక్మో, ఈ సి ఎం ఓ ఎక్మో, బ్రాంకో స్కోపీ, తొరకోస్కోపీ, ఈబస్ తదితర వ్యాధులకు ఆధునిక చికిత్స ఉందన్నారు. పేషంట్ బాషా మాట్లాడుతూ ఊపిరితిత్తుల సమస్యలతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యానని, ఇపుడు అందరిలా సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి టీం లీడర్ శ్రీనివాసరెడ్డి, పవన్ కుమార్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యన్

రుచికరమైన భోజనం వడ్డించాలి

కమలాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వంట ఏజెన్సీ నిర్వాహకులు నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని ఎంఈఓ బేబి తెలిపారు. బుధవారం స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో మండలంలోని అన్ని పాఠశాలల్లో పని చేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులకు ఎంఈఓ–2 సుభాషిణ అధ్యక్షతన నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం వడ్డించడంలో వంట ఏజెన్సీల పాత్రే కీలకం అన్నారు. మెనూ తప్పని సరిగా పాటించాలని సూచించారు. మెనూలోని పోషక విలువలు, సమతుల ఆహారం ప్రాముఖ్యత గురించి తెలియజేస్తూ ఆరు రోజుల మెనూపై అవగాహన కల్పించారు.

ఎంఈఓ –2 సుభాషిణి, హెచ్ఎం ఖాజా పర్వీన్ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలోనే భోజనం వడ్డించాలన్నారు. అనంతరం వంట ఏజెన్సీ నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అన్ని పాఠశాలల వంట ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి కృషి

కడప అగ్రికల్చర్: జిల్లాలో ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి అధికారులు కృషిచేయాలని రైతు సాధికారత సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మెన్ విజయ్‌కుమార్ అన్నారు. కడప ప్రకృతి వ్యవసాయ జిల్లా డీపీఎం కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విస్తరణపై ఏడీలు, ఉద్యాన శాఖ అధికారులకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకాన్ని అరికట్టాలన్నారు. సహజపద్ధతిలో వ్యవసాయ సాగు ద్వారా దిగుబడులను సాధించవచ్చన్నారు. దీంతోపాటు పీఎండీఎస్, 265 డేస్ గ్రీన్ కవర్, ఏటీఎం మోడల్, ఎ–గ్రేడ్ ప్రకృతి వ్యవసాయ మోడల్స్ అంశాలపై ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించారు. శిక్షణలో జిల్లా హార్టికల్చర్ అధికారి సుభాషిణి, ప్రకృతి సేద్యం పీడీ ప్రవీణ్ కుమార్, ఏడీపీఎం వసంత కుమారి, సురేష్ బాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్న విజయ్‌కుమార్



శిక్షణకు హాజరైన అధికారుల

10 నుంచి ఆధార్ శిబిరాలు

కమలాపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 10వ తేదీ నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 నుంచి 13వ తేదీల్లో చిన్న చెప్పలి, ఎల్లారెడ్డిపల్లె, ఎర్రగుడిపాడు, నల్లింగాయపల్లె గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆమె పేర్కొన్నారు. అలాగే ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు కమలాపురం –1, కమలాపురం–2, జంబాపురం, చదిపిరాళ్ల గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కేంద్రాలలో 0 నుంచి 15 ఏళ్ల వారికి ఆధార్ కార్డులు అప్‌డేట్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఆధార్ కార్డులో చిరునామా, ఫొటో మార్పు, ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ చేయడం, వేలి ముద్రలు అప్‌డేట్ చేయడం తదితర సేవలు అందజేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైభవంగా కలశ స్థాపన పూజలు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేటలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో బుధవారం కలశ స్థాపన పూజలు వేదపండితులు వెంకటరంగయ్య స్వామి వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా బుధవారం గోపూజ, గంగాదేవి పూజ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, అగ్నిప్రతిష్ఠ, దీక్షా హోమం, మృత్యుంగ్రహణం, అంకురార్పణ, జలాదివాసం వంటి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కడపను రక్తదాతల జిల్లాగా మార్చాలి

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ కడప జిల్లాను రక్తదాతల జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని ఎంఎం ఆసుపత్రి అధినేత డాక్టర్ మహబూబ్‌పీర్ పేర్కొన్నారు. కడప ఎంఎం.హాస్పిటల్‌లో రక్త దానం చేద్దాం... కడప జిల్లాను రక్తదాతల జిల్లాగా మారుద్దాం ఫ్లెక్సీ బ్యానర్‌ను డాక్టర్ ఎస్.మహబూబ్ పీర్, యునైటెడ్ ముస్లిం ఫోరం కార్యదర్శి రఫీఖాన్ బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని నేటి నుంచి జూన్ 14వ తేదీ వరకు ఇండియన్ రెడ్ క్రాస్ సీనియర్ సభ్యులు అబ్దుల్‌రాయల్ కరీముల్లా రక్త దాన ప్రచారం నిర్వహిస్తున్నటు తెలిపారు. కుల మతాలకతీతంగా ప్రతిఒక్కరూ రక్త దానం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.



ఫ్లెక్సీను విడుదల చేస్తున్న డాక్టర్ మహబూబ్‌పీరా

వ్యవసాయంలో సాంకేతికతతో సత్ఫలితాలు

వల్లూరు: వ్యవసాయానికి సాంకేతికతను అనుసంధానం చేస్తే సత్ఫలితాలు సాధించవచ్చని భారత నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ మంగేష్ దుదే పేర్కొన్నారు. మండల పరిధిలోని తోల్లగంగన పల్లి, గోటూరు గ్రామాలలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలతో రైతుల ప్రత్యక్ష సంభాషణలు రైతులకు ఖరీఫ్ పంట కాలంలో అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి దేశ వ్యాప్తంగా 700 జిల్లాలలో శాస్త్రీయ బృందాల భాగస్వామ్యంతో నూతన సాంకేతిక, ప్రభుత్వ పథకాలపై సమాచారం అందించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నువ్వులలో మేలైన రకాలు యాజమాన్య పద్ధతుల గురించి, సూక్ష్మ నీటి ద్వారా సాగులో సాంకేతికత, డ్రోన్ల సాంకేతికత గురించి వివరించారు. ఊటుకూరు వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త మరియు అధిపతి డాక్టర్ జి. ప్రభాకర్ రెడ్డి ఖరీఫ్ సాగుకు ముందు తీసుకోవాల్సిన మెలుకువలు గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ సురేష్ కుమార్‌రెడ్డి, ఏవో సాయిజ్యోతి, డాక్టర్ శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త

బాబు ష్యూరిటీ.. వెన్నుపోటు గ్యారెంటీ

కమలాపురం: కూటమి పాలన ఏడాది పూర్తి చేసుకోవడంతో చంద్రబాబు ఇచ్చిన హామీలు విస్మరించి ప్రజలకు వెన్నుపోటు పొడవడంతో పార్టీ అధిష్టానం పిలుపు మేరకు బుధవారం పట్టణంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఖాజీపేట రోడ్డులోని గయాస్ ఫిల్లింగ్ స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ శివరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం నరేన్ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు వెన్నుపోటుకు అంబాసిడర్‌గా నిలిచారన్నారు. బాబు ష్యూరిటీ... వెన్నుపోటు గ్యారంటీ అని చమత్కరించారు. చంద్రబాబును అన్ని విధాలా అందలమెక్కించిన ఎన్టీఆర్‌నే వెన్నుపోటు పొడిచారని గుర్తు చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పని చేశారని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు, ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపడమే ప్రభుత్వ పెద్దలు పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు పరాకాష్టకు చేరుతున్నాయని, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ప్రభుత్వం నిరోధించలేక పోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కన్వీనర్లు ఉత్తమారెడ్డి, అబ్బిరెడ్డి వీరారెడ్డి, జీఎన్ భాస్కర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు సాయినాథ శర్మ, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మాసీమ బాబు, జిల్లా నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, గంగాధర్ రెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఇస్మాయిల్, హిదాయత్, సాదిక్, ఆర్‌వీఎస్ఆర్, లక్ష్మీ నారాయణ రెడ్డి, వంశీధర్ రెడ్డి, మోహన్ రెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, చీర్ల సురేష్‌యాదవ్, గండి భాస్కర్, మణికంఠ శర్మ, జిలానీ బాషా, కొర్రపాటి సుధీర్, దేవదానం, నగేష్, భాస్కర్, షావలి, జావీద్, మోనార్క్, దాసరి సురేష్, శ్రీరాం రమణ, మర్రి సుబ్బన్న, నామాల శేఖర్, చంద్రపాల్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నరేన్ రామాంజులరెడ్డి

ఆకట్టుకున్న స్కూటర్ ర్యాలీ

కమలాపురం పట్టణంలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో భాగంగా వైఎస్సార్‌సీపీ యువత చేపట్టిన స్కూటర్ ర్యాలీ ఆకట్టుకుంది. వల్లూరు మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఆధ్వర్యంలో వల్లూరు మండల యువత స్కూటర్ ర్యాలీ చేపట్టారు. వల్లూరు నుంచి కమలాపురం వరకు ఈ ర్యాలీ సాగింది. అలాగే నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి సైతం స్కూటర్ ర్యాలీగా కమలాపురానికి తరలివచ్చి నిరసన ర్యాలీలో పాల్గొన్నారు.